సాక్షి నంద్యాల

శనివారం : 7 : సెప్టెంబర్ : 2024



శాస్త్రోక్తంగా ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శుక్రవారం శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. అలాగే అంకాళమ్మ అమ్మవారికి విశేష పూజలు చేశారు.



పంటల బీమాకు మార్గదర్శకాలు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఉచిత పంటల బీమా అమలుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఇందుకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో 23 పంటలను నోటిఫై చేశారు.

IIలో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,632
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:101.773
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 32,347
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	:32,047

న్యూస్‌రీల్

సామరస్య చిత్రం



వినాయకుడి బొమ్మను గీస్తున్న ఉపాధ్యాయురాలు అసిఫా

మహానంది: మన మతమేదైనా మానవులంతా ఒక్కటే. అన్ని మతాల సారాంశం సైతం సాటి మానవుడిని ప్రేమించాలి, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలన్నదే. అందులో భాగంగా మహానంది మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం గ్రామంలోని ఏపీ మోడల్ పాఠశాలలో శుక్రవారం ఎకో ఫ్రెండ్లీ గణేశుడి ఐడాల్స్‌ను తయారు చేసే సమయంలో విద్యార్థులకు అవగాహన కల్పించడంలో భాగంగా ఉపాధ్యాయురాలు అసిఫా గణేశుడి చిత్రాన్ని చక్కగా గీయడం ప్రత్యేకత సంతరించుకుంది.

జిల్లాలో ఓ మోస్తరు వర్షం

నంద్యాల(అర్బన్): జిల్లాలో గురువారం నుంచి శుక్రవారం ఉదయం వరకు ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. బండిఆత్మకూరు మండలంలో అత్యధికంగా 34.6, నంద్యాల మండలంలో అత్యల్పంగా 2.6 మి.మీ వర్షం కురిసింది. మిడుతూరు 34.2, పగిడ్యాల 32.8, దొర్నిపాడు 29.8, ఆత్మకూరు 29.6, శ్రీశైలం 29.4, రుద్రవరం, కొత్తపల్లి 20.4, నందికొట్కూరు 17.4, జూపాడుబంగ్లా 17.0, శిరివెళ్ల 14.8, మహానంది 14.4, చాగలమర్రి 13.8, గడివేముల 11.6, గోస్పాడు 10.4, ఆళ్లగడ్డ 10.0, డోన్ 8.8, పాణ్యం 6.4, ప్యాపిలి 6.0, కోవెలకుంట్ల 5.2, బేతంచెర్ల 4.2, కొలిమిగుండ్ల 3.2, ఉయ్యాలవాడ 3.0, బనగానపల్లె మండలంలో 2.8 మి.మీ వర్షం కురిసింది.

బంగారు పూలు విరాళం



శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం దేవస్థానానికి శుక్రవారం కర్నూలుకు చెందిన బి.సి.శివకుమార్ 108 బంగారు పూలను విరాళంగా సమర్పించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో దాతలు బంగారు పూలను సీనియర్ వేదపండితులు గంటి రాధాకృష్ణ, పర్యవేక్షకులు కె.అయ్యన్న, అమ్మవారి ఆలయ ఇన్‌స్పెక్టర్ కె.మల్లికార్జునలకు అందజేశారు. విరాళంగా సమర్పించిన బంగారు పూలు 19 గ్రాముల బరువు ఉంటాయని దాత తెలిపారు. ఆయనను వేదాశీర్వచనంతో స్వామి అమ్మవార్ల శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

9 నుంచి లాయర్ల ఎన్‌రోల్‌మెంట్

కర్నూలు (లీగల్): సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు తగ్గింపు రుసుంతో ఈనెల 9వ తేదీ నుంచి న్యాయవాదుల నమోదు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పి.రవిగువేరా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తగ్గించిన రుసుం రూ.1,250, ఎస్సీ, ఎస్టీలు రూ.625ను రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు చెల్లించాలని, దరఖాస్తు ఫారాలను బార్ కౌన్సిల్ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పారు. పూర్తి చేసిన దరఖాస్తును రుసుం చెల్లింపు చలాన్లతో పాటు సోమ, మంగళవారాలలో అమరావతిలోని బార్ కౌన్సిల్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

విఘ్నరాజాయ.. అగ్రపూజ్యాయ!



- నేడు వినాయక చవితి
- సిద్ధమైన మండపాలు
- నంద్యాలలో 800కుపైగా విగ్రహాల ఏర్పాటు
- వాడవాడలా కొలువు దీరనున్న గణనాథులు
- వేడుకలు వైభవంగా నిర్వహించడానికి ఉత్సవ కమిటీ ఏర్పాట్లు



కోవెలకుంట్లలో విక్రయ కేంద్రాల నుంచి వినాయక విగ్రహాలను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): విఘ్నాలు తొలగించే వినాయకుడి పూజలు చేసేందుకు వేళైంది. పార్వతీ తనయుడి వేడుకకు అంతా సిద్ధమైంది. చవితి సందర్భంగా శనివారం గణేశుని విగ్రహాలను కొలువుంచి ఉత్సవాలు జరిపేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. నంద్యాల జిల్లాలో గణేశ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించున్నారు. పట్టణాల్లో, పల్లెల్లో లంబోదరుడి విగ్రహాలను నెలకొల్పి పూజలు చేయనున్నారు. నంద్యాల పట్టణంలో ఈ ఏడాది 800కు పైగా విగ్రహాలు కొలువుదీరనున్నాయి. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో మండపాలను సిద్ధం చేశారు. పండుగ రోజు శనివారం విగ్రహాలను ప్రతిష్ఠించి.. పల్లెల్లో మూడో రోజు, పట్టణంలో ఐదో రోజు నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్నారు. పట్టణంలోని ప్రముఖ కూడళ్లలో మట్టితో తయారు చేసిన విగ్రహాలను కొలువుంచనున్నారు. వినాయక చవితి పండుగను ఘనంగా నిర్వహించుకోడానికి భక్తులు శుక్రవారమే పూజా సామగ్రి కొనుగోలు చేశారు.

స్థానికంగానే విగ్రహాల తయారీ..

పర్యావరణాన్ని కాపాడుదాం అనే నినాదంతో ఈ ఏడాది వినాయక చవితి వేడుకలు నిర్వహిస్తున్నారు. నంద్యాల పట్టణం బాలాజీ కాంప్లెక్స్‌లోని బాలాజీ కల్యాణ మండపంలో మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నారు. టంగుటూరు గ్రామం నుంచి వచ్చిన కళాకారులను మూడు నుంచి నాలుగు అడుగుల మేర మట్టి విగ్రహాలను తయారు చేసి అమ్ముతున్నారు. కొందరు వ్యాపారులు హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ నుంచి విగ్రహాలను తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. మండపాల నిర్వాహకులు విగ్రహాలను ఎంపిక చేసుకొని ట్రాక్టర్లలో తీసుకొని వెళ్తున్నారు.

శ్రీశైలంలో నేటి నుంచి ఉత్సవాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో శనివారం నుంచి ఈ నెల 16వ తేదీ వరకు గణపతి నవరాత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల సమయంలో ఆలయ ప్రాంగణంలోని రత్నగర్భ గణపతి, శ్రీశైలం సమీపంలోని సాక్షి గణపతి, యాగశాలలో గణపతి పంచలోహమూర్తికి వ్రతకల్ప విశేషార్చనలు నిర్వహించనున్నారు. సాక్షిగణపతి ఆలయం వద్ద మృత్తికా గణపతిని (మట్టితో చేసిన వినాయకుని విగ్రహాన్ని) నెలకొల్పి పూజాదికాలను జరపనున్నారు. భక్తుల సౌకర్యార్థమై మృత్తికా గణపతి పూజాదికాలను పరోక్షసేవగా కూడా దేవస్థానం నిర్వహిస్తోంది. ఇందుకోసం రూ.1,116 రుసుంగా నిర్ణయించారు. భక్తులు సేవా రుసుంను www.srisailadevasthanam.org ద్వారా చెల్లించే అవకాశం కల్పించారు. పరోక్షసేవను ప్రత్యక్ష ప్రసారాలను వీక్షించేందుకు వీలుగా ప్రసార వివరాలు, ప్రసారాల సమయం సేవాకర్తలకు ముందుగానే తెలియజేస్తారు. శ్రీశైల టీవీ యూట్యూబ్ ద్వారా భక్తులు వీక్షించవచ్చు.



సాక్షిగణపతి

ఉచిత సామూహిక సేవ

ధర్మప్రచారంలో భాగంగా వినాయకచవితిని పురస్కరించుకుని శనివారం ఉచిత సామూహిక సేవ నిర్వహించనుంది. తెల్లరేషన్ కార్డు కలిగిన సామాన్య భక్తులు ఉచితంగా ఈ పూజాదికాలను జరిపించుకోవచ్చు. ఉచిత సామూహిక సేవకు ఆన్‌లైన్ ద్వారా భక్తులు తమ పేర్లను నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. నమోదు చేసుకున్న భక్తులు శనివారం ఉదయం 9.30గంటలకు చంద్రవతి కల్యాణ మండపంలో హాజరుకావాల్సి ఉంటుంది. ఉదయం 10.30 గంటలకు పూజాదికాలు ప్రారంభిస్తారు. సేవాకర్తలకు లడ్డూప్రసాదాలు–2, కుంకుమ, విభూతి, కైలసకంకణాలు, శ్రీశైలప్రభ అందజేస్తారు. స్వామిఅమ్మవార్ల దర్శనం కల్పిస్తారు.

ముస్తాబైన సాక్షిగణపతి ఆలయం

గణపతి నవరాత్రోత్సవాలకు శ్రీశైలంలోని సాక్షిగణపతి ఆలయం ముస్తాబైంది. ఆలయాన్ని వివిధ పుష్పాలతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఇక్కడ శనివారం ఉదయం 8.10 గంటల నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయి.



శ్రీశైలంలో సాక్షిగణపతి ఆలయాన్ని అలంకరించిన దృశ్యం



నంద్యాలలో కొలువుదీరిన శ్రీ పంచముఖ ఆక్రూట్ మహాగణపతి



నంద్యాల పట్టణంలో మట్టి వినాయకులను అమ్మకానికి ఉంచిన దృశ్యం



నంద్యాల టెక్కె మార్కెట్‌యార్డులో పూజా సామగ్రిని కొనుగోలు చేస్తున్న భక్తులు

10న పారామెడికల్ కోర్సులకు రెండో విడత కౌన్సెలింగ్

కర్నూలు(హాస్పిటల్): పారామెడికల్ కోర్సులకు రెండో విడత కౌన్సెలింగ్ ఈ నెల 10న నిర్వహించనున్నట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కళాశాలలోని ఆడిటోరియంలో కౌన్సెలింగ్ ప్రారంభం అవుతుందన్నారు. వివిధ కోర్సుల్లో మిగిలిన డీఎంఎల్‌టీ–14, డీఏఎస్ఎస్–5, డీఎంఐటీ–4, డీఆర్‌జీఏ–3, డీవోఏ–2, డి.డయాలసిస్–6, డి. డార్క్‌రూమ్ అసిస్టెంట్–6, ఈసీజీ–3, క్యాథలాబ్–3, డి. కార్డియాలజి టెక్నీషియన్ –3 సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని.. ఈ సీట్లను మెరిట్, రోస్టర్ ఆధారంగా భర్తీ చేస్తామన్నారు.

వీఆర్వోలు, సర్వేయర్లకు బదిలీల కౌన్సెలింగ్

కర్నూలు(సెంట్రల్): గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న వీఆర్వోలు, సర్వేయర్లకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో వీఆర్వోలకు కలెక్టరేట్ ఏఓ పి.రాజేశ్వరి, సర్వేయర్లకు కర్నూలు సర్వే ఏడీ మునికన్నన్, నంద్యాల, అనంతపురం ఇన్‌చార్జి సర్వే ఏడీ రూప్లా నాయక్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ చేపట్టారు.

వాటర్‌గ్రిడ్ పనులు ఆపడం దారుణం

- శాశ్వత అభివృద్ధి పనులను కొనసాగించాలి
- మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

ప్యాపిలి: డోన్ నియోజకవర్గ ప్రజలకు మంచినీరు ఇవ్వాలనే ఉద్దేశంతో రూ. 300 కోట్లతో తాము ప్రారంభించిన వాటర్ గ్రిడ్ పనులను ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేయడం దారుణమని మాజీ ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. ప్రజల సమస్యలు తొలగించేందుకు ప్రారంభించిన శాశ్వత అభివృద్ధి పనులను కొనసాగించాలని సూచించారు. శుక్రవారం ఆయన ప్యాపిలి మండలంలోని కంబగిరి స్వామి ఆలయం ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లోని ప్రతి ఇంటికీ మంచినీటిని అందించాలనే ఉద్దేశంతో వాటర్‌గ్రిడ్ పనులు 90 శాతం పూర్తి చేశామన్నారు. మిగిలిన పది శాతం పనులను పూర్తి చేయలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. డోన్ సమీపంలో ఐడీటీఆర్ నిర్మాణం కూడా పూర్తయిందని, ఇక్కడ ఏటా 600 మంది విద్యార్థులు శిక్షణ పూర్తి చేసుకుని నెలకు రూ. 30 వేలు తక్కువ కాకుండా వేతనం లభించే ఉద్యోగాల్లో స్థిరపడతారని తెలిపారు. ఈ పనులను కూడా ప్రభుత్వం వెంటనే పూర్తి చేయడం ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. హుసేనాపురంలో నిర్మించిన వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల, షెపర్డ్ ట్రైనింగ్ సెంటర్‌లో మౌలిక సదుపాయాల కల్పన మాత్రమే పెండింగ్‌లో ఉందన్నారు. ఈ పనులు పూర్తి చేసి వెంటనే వాటిని వినియోగంలోకి తీసుకురావాలన్నారు. చెరువులకు నీరు నింపడం ద్వారా భూగర్భ జలాలు అభివృద్ధి చెందటంతో పాటు వేలాది హెక్టార్లలో మాగాణి సాగులోకి వస్తుందన్నారు. తద్వారా వేలాది మంది వ్యవసాయ కూలీలకు ఉపాధి లభించడంతో పాటు వలసల నివారణ సాధ్యం అవుతుందన్నారు. ప్యాపిలి పట్టణంలో దేశంలోనే అతి పెద్దదైన ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్, హార్టికల్చర్ మార్కెట్ నిర్మించేందుకు రూ. 49 కోట్ల రూపాయలను తాము మంజూరు చేయించామన్నారు. దీంతో ఈ ప్రాంతంలో రైతాంగం పండించిన పండ్లు, కూరగాయలు పెద్ద మొత్తంలో నిలువ చేసి అవసరమైనప్పుడు అత్యధిక ధరలకు అమ్ముకునే అవకాశం ఉంటుందన్నారు. ఇక్కడి నుంచే నేరుగా బెంగళూరు, చెన్నై, విశాఖపట్టణం, హైదరాబాదు మార్కెట్‌లకు రైతులు తాము పండించిన పంటను నేరుగా తీసుకెళ్లే అవకాశం ఉంటుందన్నారు. ఈ పనులు వెంటనే ప్రారంభించి నిత్యం కరువు కాటకాల బారిన పడుతున్న రైతాంగాన్ని ఆదుకోవాల్సిన అవసరం ప్రస్తుత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, కంబగిరి స్వామి ఆలయ ధర్మకర్త చల్లా సూర్యనారాణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, బోరెడ్డి పుల్లారెడ్డి, బోరెడ్డి రాము, దివాకర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రాణం నిలిపిన సాయం

బేతంచెర్ల: మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చేసిన సాయం తన ప్రాణం నిలిపిందని బేతంచెర్ల పట్టణంసంజీవనగర్ కాలనీకి చెందిన బోయ పెద్ద బాబు తెలిపారు. శుక్రవారం బుగ్గనను కలసి పూలమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పెద్దబాబు మాట్లాడుతూ.. తనకు రెండు కిడ్నీలు చెడిపోయి ఆపరేషన్ కోసం ఆర్థిక సాయం అందించాలని వైఎస్సార్‌సీపీ హయాంలో బుగ్గనకు విన్నవించగా సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.8 లక్షలు మంజూరు చేయించారు. దీంతో ఆపరేషన్ చేయించుకొని కోలుకున్నానన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి రుణం తీర్చుకోలేనిదని పెద్ద బాబు తెలిపారు.



బుగ్గనకు కృతజ్ఞతలు చెబుతున్న పెద్దబాబు

నకిలీల విపత్తు!

- జిల్లాలో విచ్చలవిడిగా నకిలీ విత్తనాల విక్రయాలు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- ఇప్పటివరకు 708 క్వింటాళ్ల విత్తనాల సీజ్
- వీటిలో పత్తి, మిరప విత్తనాలే అధికం
- నకిలీ మొక్కజొన్న విత్తనాలు సాగు చేసి లబోదిబోమంటున్న రైతులు
- కంకికి పూర్తిస్థాయిలో గింజలు రావడం లేదని ఆందోళన

సాక్షి, నంద్యాల: నకిలీ విత్తనాలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఆశగా సాగు చేసిన పంట చేతికిరాకముందే నాశనం అవుతుంటే కన్నీటి పర్యంతమవుతున్నారు. దుకాణాల్లో తనిఖీ చేసి నకిలీ విత్తనాల విక్రయాలను అడ్డుకోవాల్సిన వ్యవసాయశాఖాధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 2,36,920 హెక్టార్లు కాగా.. ఇందులో వరి 65,787 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. తర్వాత రైతులు విరివిగా మొక్కజొన్నన వేస్తున్నారు. మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 45,210 హెక్టార్లు కాగా ఇప్పటికే రైతులు పూర్తిస్థాయిలో పంటను సాగు చేశారు. జూన్‌లోనే పంట సాగు చేయడంతో పంట ప్రస్తుతం కంకి దశలో ఉంది. జూపాడుబంగ్లా, గడివేముల, మిడుతూరు మండలాల్లోని రైతులు నకిలీ విత్తనాలతో నిండా మునిగారు. ఆశతో సాగు చేసిన పంటలో దిగుబడి రాకపోవడంతో కన్నీటి పర్యంతమవుతున్నారు.

ఒక్కో మొక్కకు రెండు మూడు కంకులు

సాధారణంగా మొక్కజొన్న మొక్కకు ఒకే కంకి వస్తుంది. కానీ, జూపాడుబంగ్లా, గడివేముల, మిడుతూరు మండలాల్లో సాగు చేసిన మొక్కజొన్న మొక్కలకు రెండు మూడు కంకులు వచ్చాయి. కాసిన అన్ని కంకుల్లోనూ విత్తనాలు లేవు. ఇదేంటని విత్తనాలు విక్రయించిన దుకాణదారులను ప్రశ్నిస్తే మీరసలు రైతులే కాదు.. మీకు పంట సాగు చేయడం వచ్చా అంటూ నిర్లక్ష్యంగా, ఇష్టమొచ్చినట్లు మాట్లాడారని రైతులు వాపోతున్నారు. జూపాడుబంగ్లా మండలంలో 4,409 ఎకరాలు, మిడుతూరు మండలంలో 3,417 ఎకరాలు, పాములపాడులో 4,674 ఎకరాలు, గడివేములలో వెయ్యి ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. నాలుగు మండలాల్లో కలిపి సుమారు 150 మంది రైతులు నందికొట్కూరులో విత్తనాలను కొనుగోలు చేశారు. స్టార్ –65 రకానికి చెందిన విత్తనాలను సాగు చేశామని రైతులు చెబుతున్నారు.

కన్నెత్తి చూడని శాస్త్రవేత్తలు

నకిలీ విత్తనాలపై రైతులు మండల కార్యాలయంలో వ్యవసాయాధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయా మండలాల్లో ఏఓలు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి మొక్కజొన్న పంట తీరును, విత్తనాల కొనుగోలుకు సంబంధించిన బిల్లుల వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ శాస్త్రవేత్తలకు నివేదికలు పంపించారు. కానీ, నెల రోజులు గడుస్తున్నా శాస్త్రవేత్తలు అటువైపు కూడా కన్నెత్తి చూడలేదు. దీంతో అదును దాటుతుండడంతో కొంతమంది రైతులు పంటను దున్నేసి కొత్త పంటను సాగు చేసుకుంటున్నారు.

పత్తి, మిరపలోనూ నకిలీల బెడద

జిల్లాలో వరి, మొక్కజొన్న తర్వాత ఆ స్థాయిలో కందులు, పత్తి, మిరప పంటలను రైతులు సాగు చేస్తున్నారు. అయితే విత్తనాల విక్రయదారులు కొత్త వంగడాలు వచ్చాయని ఈ విత్తనం వేసుకుంటే అధిక దిగుబడి వస్తుందని మాయమాటలు చెప్పి నకిలీ వంగడాలను రైతులకు అంటగడుతున్నారు. మరోవైపు విత్తన దుకాణాలపై అధికారులు తూతూమంత్రంగా దాడులు చేపడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టాల్సిన వారే చోద్యం చూస్తున్నారని రైతులు ఫిర్యాదు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 370 విత్తన దుకాణాలల్లో తనిఖీలు చేసి 707.39 క్వింటాళ్ల విత్తనాలను విక్రయించకుండా సీజ్ చేశారు. వీటి విలువ రూ.76.86 లక్షలుగా అధికారులు చెబుతున్నారు. సీజ్ చేసిన వాటిలో ఎక్కువగా పత్తి, మిరప విత్తనాలు ఉన్నాయి.



ఒక్కో మొక్కకు నాలుగు కంకులు వచ్చిన దృశ్యం



విత్తనాలు రాని మొక్కజొన్న కంకి

కంకిని చూస్తే కన్నీరొస్తోంది



మొక్కజొన్న కంకిని చూస్తే కన్నీరు వస్తోంది. కంకిలో అసలు విత్తనాలే రాలేదు. 12 ఎకరాల్లో స్టార్–65 రకం విత్తనాలను సాగు చేశాను. ఎకరాకు ఇప్పటికే రూ.30వేల చొప్పున రూ.3.60లక్షల పెట్టుబడిపెట్టాను. నాసిరమైన విత్తనాలు అంటగట్టి మోసం చేసిన దుకాణం దారుడు, కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుని, మాకు నష్టపరిహారం అందజేయాలి. – చాకలిరాజు, రైతు, పారుమంచాల

శాస్త్రవేత్తలు ఎవరూ రాలేదు



నేను నాలుగు ఎకరాల్లో స్టార్–65 రకం విత్తనాలను కొనుగోలు చేసి జూన్‌లో విత్తుకున్నా. పంట కోత దశకు వస్తోంది. కంకులను పరిశీలిస్తే విత్తనాలే కనిపించడం లేదు. దీనిపై వ్యవసాయాధికారులకు ఫిర్యాదు కూడా చేశాం. వారు వచ్చి పంటలు పరిశీలించి వెళ్లారు. నంద్యాల నుంచి శాస్త్రవేత్తలు వస్తారని చెప్పారు. ఇప్పటి వరకు రాలేదు. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి. – జగపతి, రైతు, పారుమంచాల

నివేదికల ఆధారంగా చర్యలు

రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు మండల అధికారులు పంటలను పరిశీలించారు. పంట దిగుబడి తగ్గడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. పంటలను పరిశీలించాల్సిందిగా శాస్త్రవేత్తలను కోరాం. వారు పరిశీలించిన తర్వాత ఇచ్చే నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటాం. నకిలీ విత్తనాలు విక్రయించినట్లు తేలితే కంపెనీ యాజమాన్యం నుంచి పరిహారాన్ని చెల్లించేలా చర్యలు తీసుకుంటాం. – మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి, నంద్యాల

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(అర్బన్): జిల్లాలో ఉపాధి అవకాశాలు కల్పించే నూతన పరిశ్రమల స్థాపన కోసం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిశ్రమల ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా పరిశ్రమల మేనేజర్ శ్రీనివాస యాదవ్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్ర కుమార్, ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ ప్రెసిడెంట్ రాజమహేంద్రనాథ్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోమశేఖర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 93 పరిశ్రమల యూనిట్లకు రూ.8.43 కోట్లు సబ్సిడీ మొత్తాన్ని మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం, స్టాండ్ అప్ ఇండియా కింద నిర్దేశించిన 66 యూనిట్ల లక్ష్యం మేర యూనిట్ల నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజామహేంద్రనాథ్ , ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ అధ్యక్షుడు రామలింగారెడ్డి, ఆర్‌డీఓ శివారెడ్డి పాల్గొన్నారు.



సూక్ష్మంలో మోక్షం

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని నంద్యాలకు చెందిన చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ అగ్గిపెట్టెపై 60 సూక్ష్మ వినాయకుల చిత్రాలను గీచి అబ్బుర పరిచారు. రెండు అంగులాల పొడవు, రెండున్నర అంగులాల వెడల్పు గల అగ్గిపెట్టెపై మైక్రో బ్రష్‌తో 2 గంటల వ్యవధిలో గణనాథుల చిత్రాలను వేశారు. ఈ సందర్భంగా కోటేష్ మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా వినాయక చవితి సందర్భంగా స్వామి చిత్రాలను వేస్తున్నానన్నారు. చిత్రంలో త్రిముఖ గణపతి, నాట్య గణపతి, శంఖులో గణపతి, ఓం ఆకారంలో గణనాథుడు, కాణిపాకం గణనాథుల చిత్రాలు వేశానన్నారు. – నంద్యాల(అర్బన్)

ప్రిన్సిపాల్, ఇద్దరు ఫ్యాకల్టీలకు మెమో

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్‌తో పాటు ఇద్దరు ఫ్యాకల్టీలకు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు మెమో జారీ చేశారు. సీఎస్‌ఈ ఫ్యాకల్టీ శ్వేత ప్రియ అనుమతి లేకుండా కాలేజీకి హాజరు కాకపోవడంతో మెమో ఇచ్చారు. తరగతులు రెగ్యులర్‌గా జరిగేలా పర్యవేక్షణ చేయకపోవడం, ఇంజినీరింగ్ విద్యార్థుల హాజరు శాతం తక్కువ ఉండటంతో సీఎస్‌ఈ హెచ్‌ఓడీ సతీష్‌కుమార్, ప్రిన్సిపాల్ హరిప్రసాద్ రెడ్డి నుంచి వివరణ కోరినట్లు రిజిస్ట్రార్ తెలిపారు. ఈ నెల 3వ తేదీన వర్సిటీ వీసీ ఆకస్మికంగా తనిఖీ చేయగా ఈ విషయాలు వెలుగు చూశాయని, ఈ మేరకు మెమో జారీ చేసినట్లు చెప్పారు.

పంటల బీమా అమలుకు మార్గదర్శకాలు

ఉమ్మడి జిల్లాలో 22 పంటలు నోటిఫై

- గ్రామం యూనిట్‌గా వరికి బీమా
- వాతావరణ బీమా కింద పత్తి, వేరుశనగ ఎంపిక



కర్నూలు(అగ్రికల్చర్): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఉచిత పంటల బీమా అమలుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. నోటిఫై చేసిన పంటలు ఈ-పంటలో నమోదు చేసుకొని ఈ-కేవైసీ చేయించుకుంటే ఉచిత పంటల బీమా వర్తిస్తుంది. పంట కోత ప్రయోగాల ఆధారంగా పరిహారం లభిస్తుంది.

☛ వరికి హెక్టారుకు రూ.లక్షకు బీమా చేస్తారు.

☛ వాతావరణ ఆధారిత బీమా కింద ఉమ్మడి జిల్లాలో పత్తి, వేరుశనగలను నోటిఫై చేసింది.

☛ వాతావరణ బీమా అమలుకు రిస్క్ పీరియడ్ వేరుశనగ పంటకు జూలై 16 నుంచి అక్టోబర్ 31 వరకు, పత్తిలో జూలై 1 నుంచి నవంబర్ 30 వరకు ఉంటుంది. ఈ మధ్యలో కురిసే అధిక వర్షాలు, వర్షాభావం, చీడపీడలు ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకొని బీమా అమలు చేస్తారు.

☛ పత్తికి హెక్టారుకు రూ.లక్ష, వేరుశనగకు రూ.70 వేలకు బీమా చేస్తారు.

☛ రైతుల వాటా ప్రీమియాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. అప్పుడే రైతులకు బీమా మొత్తం అందనుంది. 2023 ఖరీఫ్ పంటల బీమా పరిహారం ఇంతవరకు అందలేదు. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం రైతుల వాటా ప్రీమియాన్ని చెల్లించే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయింది. ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం దీన్ని విస్మరించడంతో రైతులకు అన్యాయం జరుగుతోంది.

కర్నూలు జిల్లాలో బీమా అమలు ఇలా..

గ్రామం యూనిట్: వరి.
మండలం యూనిట్: కంది, ఎండుమిర్చి, జొన్న, ఆముదం.
జిల్లా యూనిట్: కొర్ర, సజ్జ, ఉల్లి.

నంద్యాల జిల్లాలో బీమా అమలు ఇలా..

గ్రామం యూనిట్: వరి.
మండలం యూనిట్: మొక్కజొన్న, కంది, మినుము, ఎండుమిర్చి.
జిల్లా యూనిట్: జొన్న, సజ్జ, కొర్ర, ఆముదం.

ప్రతి స్కూల్‌ను ఎంఈఓలు తనిఖీ చేయాలి




సమీక్షకుహాజరైన విద్యాశాఖ అధికారులు, (ఇన్‌సెట్) మాట్లాడుతున్న నరసింహారావు

కర్నూలు సిటీ: ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల విద్యాధికారులు కచ్చితంగా ప్రతి స్కూల్‌ను తనిఖీలు చేయాలని ఏపీ రెసిడెన్షియల్ సొసైటీ డైరెక్టర్, జిల్లా పరిశీలకులు నరసింహారావు సూచించారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లాలోని డీఈఓ, డిప్యూటీ డీఈఓ, ఎంఈఓలు, సీఆర్పీలు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూడైస్‌లో వివరాలను నమోదు చేసే సమయంలో ఎక్కడా చిన్నపొరపాటు జరుగకూడదని, ప్రధానంగా పుట్టిన రోజు తేదీలు పక్కగా నమోదు చేయాలన్నారు. ప్రతి రోజు ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు సకాలంలో వేసేలా చర్యలు తీసుకోవాలని, చాలా స్కూళ్లలో సాయంత్రం నిర్దేశించిన సమయం కంటే ముందుగానే వెళ్లుతున్నారని, దీనిపై డీఈఓ, డిప్యూటీ, ఎంఈఓలు పరిశీలించాలన్నారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కడా ప్రభుత్వ గుర్తింపు లేని ప్రైవేటు స్కూళ్లు ఉండరాదన్నారు. సమావేశం ఇకపై ప్రతి నెలా ఉంటుందని, జిల్లా స్థాయిలో సైతం రెగ్యులర్‌గా సమీక్షలు చేసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో కర్నూలు డీఈఓ కాగిత శామ్యూల్, నంద్యాల డీఈఓ సుధాకర్ రెడ్డి, ఏడీలు, డిప్యూటీ డీఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదిలోకి కుక్క.. విద్యార్థినిపై దాడి



కుక్కకాటుకు గురైన విద్యార్థిని

కర్నూలు సిటీ: నగరంలోని బీ-క్యాంపు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఓ విద్యార్థినిపై కుక్క దాడి చేసింది. శుక్రవారం తరగతి గది నుంచి విద్యార్థులు బయటకు వస్తున్న సమయంలో హెచ్‌ఎం గది దగ్గర ఉన్న కుక్క 9వ తరగతి చదువుతున్న విద్యార్థి సంతోషి కాలును కరిచింది. స్కూల్‌కి కాంపౌండ్ వాల్‌తో పాటు, తరగతి గదులకు గ్రిల్ కూడా ఉంది. అయినా కూడా కుక్క లోపలికి వచ్చి విద్యార్థినిని కరవడంపై తల్లిదండ్రులు హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కుక్కకాటుకి గురైన విద్యార్థిని ఆసుపత్రికి తీసుకెళ్లకుండా జాప్యం చేయడంతో విద్యార్థిని తండ్రి తిరుపాల్ పాఠశాల సిబ్బందిని నిలదీశారు. అనంతరం విషయం డిప్యూటీ డీఈఓ హనుమంతరావుకు ఫోన్ చేసి ఫిర్యాదుగా చేయగా, తను విచారించి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. అనంతరం కుక్కకాటుకు గురైన విద్యార్థినిని ఆసుపత్రికి తీసుకపోయి చికిత్స చేయించారు.

మహిళ దారుణహత్య

నందికొట్కూరు: పట్టణంలోని మారుతీనగర్ లో ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. ఘటన స్థలాన్ని డీఎస్పీ రామాంజినాయక్, రూరల్ సీఐ సుబ్రమణ్యం, ఎస్‌ఐ సురేష్‌బాబు శుక్రవారం ఉదయం పరిశీలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మారుతీ నగర్‌కు చెందిన పింజరి శాలుబీ (41) ఒంటరిగా జీవిస్తోంది. గురువారం అర్ధరాత్రి కొందరు యువకులు ఆమెను హత్య చేసినట్లు తెలుస్తోంది. 2015లో పట్టణానికి చెందిన గంజేంద్ర అనే వ్యక్తి హత్య కేసులో శాలుబీ నిందితురాలు. ఈ క్రమంలో గజేంద్ర కుమారుడు చందు కొందరు యువకులతో కలసి ఈ హత్యకు పాల్పడి ఉంటాడనే అనుమానం వ్యక్తమవుతోంది. చందు పరారీలో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. హతురాలి కుమారుడు పింజరి మౌలాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన కర్నూలు సిటీ ప్లానర్

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగంలో సిటీ ప్లానర్‌గా ప్రదీప్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతవారం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. శుక్రవారం బాధ్యతలు చేపట్టిన ఆయన్ను టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

అప్పుల భారంతో చోరీకి యత్నం

- సబ్ పోస్టాఫీస్‌లో చోరీ కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపిస్తున్న సీఐ కృష్ణయ్య

బనగానపల్లె రూరల్: ఓ యువకుడు అప్పుల భారంతో చోరీకి యత్నించి చివరకు పోలీసులకు చిక్కాడు. గత ఈ నెల 25వ తేదీన బనగానపల్లె సబ్ పోస్టాఫీసులో చోరీకి యత్నించిన నిందితుడిని అరెస్టు చేసినట్లు బనగానపల్లె సీఐ కృష్ణయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు వివరాలను మీడియాకు వివరించారు. పట్టణంలోని ఖాజీవాడలో నివాసముంటున్న సయ్యద్‌ముస్తాఫా అలీ మేస్త్రీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో కొంత అప్పులు కావడంతో ఒత్తిడి పెరిగింది. బనగానపల్లె సబ్‌పోస్టాఫీస్‌లో సొమ్మును అపహరించి అప్పులు కట్టుకోవాలని పథకం వేశాడు. ఈ మేరకు గత నెల 25వ తేదీన పోస్టాఫీసు వెనుక డోర్ తాళం ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించాడు. అయితే అక్కడ ఎలాంటి డబ్బులు లభించకపోవడంతో నిరాశతో వెనుదిరిగాడు. మరుసటి రోజు తపాలా ఉద్యోగుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించి శుక్రవారం స్థానిక జీఎంఆర్ ఫంక్షన్‌హాల్ సమీపంలో అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరుస్తున్నట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు.



పారుతున్న 'అందాలు'

చుట్టూ ఎత్తయిన కొండలు.. పరుచుకున్న పచ్చదనం.. ఆ మధ్య నుంచి తెల్లని జలపాతం ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తుంది. ఒక మోస్తరు వర్షం కురిసిందంటే చాలు.. కర్నూలు-నంద్యాల రహదారిలో తమ్మరాజుపల్లె ఘాట్ వద్ద ఈ దృశ్యం ఆవిష్కృతమవుతుంది. చూపు తిప్పుకోనివ్వని ఈ జలపాతాన్ని చేరుకోవడం కూడా కష్టమే. ఒకప్పుడు ఆ ప్రాంతంలో ఒక అగ్రహారం ఉండేదని, అయితే సరైన సౌకర్యాలు లేకపోవడంతో స్థానికులు అక్కడి నుంచి ఖాళీ చేసి వెళ్లిపోయినట్లుగా తెలుస్తోంది. ఎత్తయిన కొండపైనున్న బండ పరుపు మీదుగా గద్దెల దేరిగా పిలువబడే ఈ జలపాతం పరవళ్లు తొక్కుతూ సమీపంలోని కొచ్చెరువులో కలుస్తోంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

డీఆర్‌డీఏ బదిలీల్లో రాజకీయ జోక్యం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) బదిలీల్లో రాజకీయ జోక్యం పెరిగిపోయింది. కోరుకున్న చోటుకు బదిలీ అయ్యేందుకు సిబ్బంది రాజకీయ పార్టీల నేతల సిఫారస్సు లేఖలు తేవడం పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తం అవుతోంది. బదిలీల గడువును ఈ నెల 15 వరకు పొడిగించడంతో రాజకీయ జోక్యం మరింత పెరిగింది. ఉమ్మడి జిల్లా యూనిట్‌గా బదిలీలు చేపట్టనున్నారు. ఒకేచోట ఐదేళ్లపైబడి పనిచేస్తున్న వారు విధిగా బదిలీ కావాల్సి ఉంది. ఈ కోవలోని ఉద్యోగులు ఉమ్మడి జిల్లాలో 79 మంది ఉన్నారు. మరో 66 మంది రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. సెప్టెంబర్ 15న బదిలీ ఉత్తర్వులు జారీ చేయనుండగా.. 16న కొత్త పోస్టుల్లో చేరేలా చర్యలు తీసుకున్నారు.

కర్నూలులో పేకాటరాయుళ్ల అరెస్ట్

కర్నూలు: కర్నూలు బంగారుపేటలోని కేసీ కెనాల్ పక్కన కంప చెట్లలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో రెండవ పట్టణ సీఐ జీ.వి.నాగరాజురావు తన సిబ్బందితో దాడి చేసి 14 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం సాయంత్రం పక్కా సమాచారం మేరకు కేసీ కెనాల్ గట్టుపైన తనిఖీ నిర్వహించి ముళ్లపొదల మాటున పేకాట ఆడుతున్న బూడిదపాడు గ్రామానికి చెందిన ఈడిగ శ్రీధర్, బోయ హనుమంతు, గుర్రం సురేందర్‌రెడ్డి, మాచాపురం గ్రామానికి చెందిన వడ్డె వీరేష్, కర్నూలు ఎ.క్యాంప్‌కు చెందిన గురుప్రకాష్, సీక్యాంప్‌కు చెందిన షేక్ ఫయాజ్ బాషా, ఎల్‌బీఎస్ నగర్‌కు చెందిన షేక్ అఫ్జల్ బాషా, దిన్నెదేవరపాడుకు చెందిన బోయ శ్రీనివాసులు, చిదంబరరావు వీధికి చెందిన కుమ్మరి శేఖర్, ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన నల్లబోతుల రవిశంకర్, కల్లూరుకు చెందిన షేక్ అబ్దుల్లా, ప్రకాష్‌నగర్‌కు చెందిన షేక్ అబ్దుల్లా, ఉప్పరి ఈరన్న, వనపర్తి జిల్లా పెబ్బేరుకు చెందిన పోనప్ప, బంగారుపేటకు చెందిన నీలిషికారి ఆంజనేయులును అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. వారి నుంచి రూ.1.60 లక్షల నగదుతో పాటు 14 సెల్‌ఫోన్లను సీజ్ చేసినట్లు తెలిపారు.

బనగానపల్లెలో పట్టపగలు దోపిడీ

- వృద్ధురాలిపై దాడి చేసి బంగారు ఆభరణాలు అపహరణ



బనగానపల్లె రూరల్: బనగానపల్లె పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శుక్రవారం పట్టపగలు గుర్తు తెలియని దుండగుడు దోపిడీకి పాల్పడ్డాడు. వృద్ధురాలిపై దాడి చేసి బంగారు ఆభరణాలు అపహరించాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక సప్తగిరి లాడ్జీ యజమానురాలు ఎర్రగొల్ల పార్వతమ్మ అక్కడే ఒంటరిగా నివాసం ఉంటోంది. శుక్రవారం ఉదయం ముఖానికి హెల్మెట్ ధరించిన గుర్తు తెలియని దుండగుడు అకస్మాత్తుగా వృద్ధురాలి వద్దకు వచ్చి ఆమె మెడలోని బంగారు గొలుసు అపహరించేందుకు ప్రయత్నించాడు. పార్వతమ్మ ప్రతిఘటించడంతో దుండగుడు తన తలకు పెట్టుకున్న హెల్మెట్‌తో ఆమె తలపై బలంగా కొట్టాడు. దీంతో బాధితురాలు అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వెంటనే దుండగుడు బంగారు గొలుసుతో పాటు ఆమె చేతులకు ఉన్న గాజులు, ముక్కురాళ్లు తీసుకుని అక్కడి నుంచి పారిపోయాడు. కొద్దిసేపటికి తేరుకున్న బాధితురాలు కేకలు వేయడంతో దోపిడీ ఘటన వెలుగు చూసింది. విషయం తెలుసుకున్న సీఐ కృష్ణయ్య వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. చోరీకి గురైన బంగారు ఆభరణాల విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని బాధితురాలి కుటుంబీకులు తెలిపారు. కాగా దోపిడీకి పాల్పడిన దొంగ బైక్‌పై వచ్చి తన పని పూర్తి చేసుకుని వెళ్లిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

'ఉయ్యాలవాడలో సోలార్ ప్లాంట్ వద్దు'



కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న ఏపీ రైతుసంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఓర్వకల్ మండలం ఉయ్యాలవాడలో సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తే కలెక్టరేట్‌ను దిగ్బంధిస్తామని రైతు సంఘాలు హెచ్చరించాయి. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి, ఆ సంఘం గౌరవాధ్యక్షుడు పి.రామచంద్రయ్య మాట్లాడుతూ.. ఉయ్యాలవాడలో సోలార్ ప్లాంటు వద్దని గ్రామ పంచాయతీ ముక్తకంఠంతో తీర్మానం చేసిందన్నారు. అయినా రెవెన్యూ, సర్వే అధికారులు రైతుల అనుమతి లేకుండా పొలాలను సర్వే చేయడం దారుణమన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న సమయంలో టీడీపీనాయకులు సోలార్ ప్లాంటు వద్దని వినతులు ఇచ్చారని, ఇప్పుడు నోరు మెదపకుండా ఉండడం అన్యాయమన్నారు. 20 రోజుల్లోపు సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోమని ప్రకటన చేయకపోతే కలెక్టరేట్‌ను దిగ్బంధిస్తామని హెచ్చరించారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, నాయకులు జగన్నాథం, నాగన్న, రమేష్, మధుసూదన్, రైతులు పాల్గొన్నారు.

డీమైలినేషన్ డిజార్డర్‌కు చికిత్స

కర్నూలు(హాస్పిటల్): మెదడులో ప్రొటీన్లు కరిగి ఇబ్బందులు పడుతున్న ముగ్గురు చిన్నారులకు కర్నూలులోని కిమ్స్ కడల్స్ హాస్పిటల్స్ వైద్యులు సత్వర చికిత్స అందించి ప్రాణం పోశారు. వివరాలను పీడియాట్రిక్ న్యూరాలజిస్టు డాక్టర్ శ్వేత రాంపల్లి శుక్రవారం వివరించారు. ఆదోని ప్రాంతానికి చెందిన రెండేళ్ల పాప, అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన ఐదేళ్ల బాబు, కర్నూలు జిల్లాకు చెందిన 10 ఏళ్ల బాలుడు జ్వరం, వాంతులు, కాళ్లు చేతులు కదిలించలేకపోవడం వంటి లక్షణాలతో ఆసుపత్రికి వచ్చారు. ముగ్గురినీ ఐసీయూలో చేర్చుకుని పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్ డాక్టర్ నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో లక్షణాలను బట్టి చికిత్స అందించాం. పరీక్షల ఫలితాలను బట్టి ఈ ముగ్గురికీ డీమైలినేషన్ డిజార్డర్, న్యూరోమైలిటీస్ ఆప్టికా స్పెక్ట్రమ్ డిజార్డర్ అనే సమస్య వచ్చినట్లు గుర్తించాం. ఆ మేరకు చికిత్స అందించగా ముగ్గురికీ లక్షణాలు క్రమంగా తగ్గాయి. మరికొంత కాలం ఇమ్యునోసప్రెసివ్ మందులు వాడాలని సూచించి డిశ్చార్జ్ చేశాం. కొన్నివారాలు, నెలల చికిత్స అనంతరం ముగ్గురూ కోలుకున్నారు అని వివరించారు.

వివాదం రేపుతున్న మురుగునీరు మళ్లింపు

నంద్యాల(అర్బన్): బిల్లాలపురం గ్రామం బీసీ కాలనీలో మురుగునీరు మళ్లింపు వివాదానికి కారణమవుతోంది. స్థానికులు రంగయ్య ఇంటి వద్ద మురుగునీరు చేరి రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తుండటంతో సంబంధిత అధికారులు కచ్చా డ్రైన్ ద్వారా తరలించేందుకు చర్యలు చేపట్టారు. అయితే మురుగునీరు ఎస్సీ శ్మశాన వాటికలోకి వస్తున్నాయంటూ స్థానికులు దేవాంతకుడు, భాస్కర్, ఎర్రన్న, ఏలియా, పేతురులు అభ్యంతరం చెప్పారు. డ్రైన్ ద్వారా మురుగు నీరు దూర ప్రాంతానికి తీసుకెళ్తామని అధికారులు చెబుతున్నా స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. రంగయ్య ఇంటి నుంచి డ్రైనేజీ కాల్వ ఏర్పాటు ద్వారా చిన్నచెరువు తూము నుంచి వెళ్లేలా చూడాలంటూ ఎస్సీ కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఈఓఆర్‌డీ వెంకటేశ్వరరావును వివరణ కోరగా కచ్చా కాల్వ ద్వారా ఎవరికి ఇబ్బందులు కలుకుండా మురుగు నీరు పంపించేందుకు చర్యలు చేపడుతామన్నారు.

ఖైదీలకు ఉచితంగా న్యాయసేవలు

కర్నూలు (లీగల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి శుక్రవారం పంచలింగాల గ్రామంలోని జిల్లా జైలు, మహిళా జైలును సందర్శించారు. జైలు అధికారులను అడిగి ఖైదీల వివరాలను తెలుసుకున్నారు. వారికి అందించే భోజన సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. ఖైదీలకు ఉచిత న్యాయ సేవల గురించి వివరించారు. జైలు పర్యవేక్షణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.